సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

క్యాథలిక్ పరీక్షలో ఉత్తీర్ణులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఫాదర్ జాన్ ప్రకాష్

దాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల పునీత ఆంథోనీ చర్చి పండగను పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన మహోత్సవంలో ఈ ఏడాది జనవరి 26న నిర్వహించిన ఆర్‌సీఎం అగ్రపీఠం క్యాథలిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పునీత పేతురు ప్రధాన దేవాలయం విచారణకర్త ఫాదర్ జాన్ ప్రకాష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల విశ్వాసులనుద్దేశించి మాట్లాడారు. క్రీస్తు బోధనలు వ్యాప్తి చేయడంలో పునీత ఆంథోనీ ఎంతో కృషి చేసినట్టు చెప్పారు. 1917లో చర్చిని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి అనేక అద్భుతాలు చర్చిలో జరిగినట్టు తెలిపారు. కార్యక్రమంలో పునీత ఆంథోనీ చర్చి విచారణ కర్తలు ఫాదర్ బాలశౌరి, వివిధ చర్చిల ఫాదర్లు, కన్యక స్త్రీలు, అధిక సంఖ్యలో విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు మృతదేహం అప్పగింత



మృతదేహాన్ని అప్పగిస్తున్న లడ్డూ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

జగదాంబ: పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ జీవించే వ్యక్తి దుర్గాలమ్మ గుడి జంక్షన్ వద్ద మృతి చెంది ఉండడంతో పోలీసు సిబ్బంది వన్‌టౌన్ సీఐ జీడీ బాబుకు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ మృతదేహాన్ని పరిశీలించి పాతనగరంలో ఉన్న లడ్డూ వెల్ఫేర్ సొసైటీకి ఆ విషయం తెలిపారు. అంబులెన్స్‌లో వచ్చిన సొసైటీ సభ్యులు కేజీహెచ్ ప్రిన్సిపాల్, అనాటమీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ రవీంద్ర కిశోర్ విజ్ఞాపన మేరకు మృతదేహాన్ని అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు.

ఆర్‌అండ్‌డీ విభాగం డీన్‌గా వల్లి కుమారి బాధ్యతల స్వీకరణ



ప్రొఫెసర్ వల్లి కుమారికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న ఆచార్యుడు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) విభాగం డీన్‌గా కంప్యూటర్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ వి.వల్లి కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు పదవీ బాధ్యతలను ఆచార్య కె.బసవయ్య అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త డీన్‌ను పలువురు ఏయూ ఆచార్యులు అభినందించారు.

సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు రేపు

సీతంపేట: ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యం గల వారికి ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విద్యార్థులకు ఉన్న సందేహాలను ఆయా సబ్జెక్టుల నిపుణులు నివృత్తి చేయనున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు హెచ్‌ఎం లక్ష్మీ నరస ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌కే కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారం క్లాత్ అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగ జ్యోతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నత్తే నయం..

- వన్‌టౌన్‌లో ముందుకు సాగని రహదారి నిర్మాణం.. కల్వర్ట్ పనులు
- ఇబ్బంది పడుతున్న బంగారం వ్యాపారులు, చిరు వర్తకులు
- ట్రాఫిక్ మళ్లింపుతో పెరిగిన రద్దీ



రాకపోకలు లేకపోవడంతో వన్‌టౌన్‌లో రోడ్డు మధ్యన పార్కింగ్ చేసిన వాహనాలు



టౌన్ కొత్తరోడ్డు వద్ద ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న కల్వర్ట్

జగదాంబ: వన్‌టౌన్ ప్రధాన రహదారిలో కల్వర్ట్ నిర్మాణం నత్త నడకన సాగుతుండడంతో పాతనగర వాసులు ఇబ్బందులు పడుతున్నారు. జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు ప్రధాన రహదారిని వెడల్పు చేసే పనులు జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టర్నర్ చౌల్ట్రీ నుంచి పూర్ణామార్కెట్ వరకు పనులు చకచకా జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. నిర్మాణాలు జరక్కపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్ల వెడల్పు కోసం దుకాణాల తొలగింపుతో వ్యాపారుల పరిస్థితి దీనంగా తయారయింది.

3 వేల కుటుంబాల అవస్థ..

పాతనగరంలో బంగారం దుకాణాలు, వాటిపై ఆధారపడి జీవించేవారు, అలాగే రహదారికి ఇరువైపులా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు సుమారు 3 వేల కుటుంబాల వరకు ఉంటారు. రహదారి పనులు, కల్వర్ట్ నిర్మాణం పేరుతో రోడ్డును తవ్వి వదిలేయడంతో వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. గత సంవత్సరం ప్రారంభమైన రహదారి, కల్వర్ట్ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని అటు బంగారం వ్యాపారులు, ఇటు చిరు వర్తకులు వాపోతున్నారు.

ట్రాఫిక్ మళ్లింపుతో భయం భయం..

ప్రధాన రహదారిలో కల్వర్ట్ నిర్మాణం జరుగుతుండడంతో ట్రాఫిక్ అంతా టౌన్ కొత్తరోడ్డు మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం రద్దీగా మారిపోయింది. వాహనాల రాకపోకలతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ ఏదైనా జరిగితే రోడ్డుకు అటుగా ఉన్న వీధుల్లోకి కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేదని స్థానికులు వాపోతున్నారు.

సమస్య పరిష్కరించాలి..

ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కరించాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు. ప్రధాన రహదారి నిర్మాణం, కల్వర్ట్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 12 కోట్లు విడుదల..

జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు రూ. 12 కోట్లతో రహదారులు, ఫుట్‌పాత్‌లు, కాలువలు, కల్వర్టులు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసింది. ఈ పనుల్లో భాగంగా టౌన్ కొత్తరోడ్డు వద్ద కల్వర్ట్ నిర్మించాల్సి ఉంది. కానీ సంవత్సర కాలంగా పనులు చేపట్టకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాహన చోదకులు, చిరు వ్యాపారులు కల్వర్ట్ పనుల నేపథ్యంలో రహదారిని మూసేయడంతో అవస్థ పడుతున్నారు. ఇప్పుడు మళ్లీ వన్‌టౌన్ రహదారి పనుల్లో కదలిక వచ్చింది. అందులో భాగంగా కల్వర్ట్ పనులు కూడా ప్రారంభించారు. కానీ ఆ పనులు వేగం పుంజుకోకపోవడంతో వ్యాపారాలకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారిని అడ్డంగా తవ్వి వదిలేయడంతో చిరు వ్యాపారులు చేసేది లేక రహదారి పైనే వ్యాపారాలు చేసుకుంటున్నారు.



కల్వర్ట్ నిర్మాణంతో వ్యాపారాలు లేక నిర్మానుష్యంగా మారిన పాతనగరంలోని బంగారం దుకాణాలు

వాసుపల్లి ఔదార్యం

ముస్లిం మహిళ పిల్లల ఫీజుల కోసం రూ. 5 వేల అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: వలంటీర్‌గా పని చేసిన మౌలాలి పంజా నూర్జహాన్ పిల్లల ఫీజు కోసం వాసుపల్లిని ఆశ్రయించగా, తన సొంత నిధుల నుండి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వలంటీర్ ఉద్యోగం లేక పిల్లల ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్న ముస్లిం వర్గానికి చెందిన నూర్జహాన్‌కు వాసుపల్లి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తామని ఉన్న వలంటీర్లను తొలగించిందన్నారు. ఉద్యోగాలు లేక, పథకాలు అందక ఎంతో మంది పేదలు కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తన వద్దకు వచ్చే పేదలు మళ్లీ జగనన్న అధికారంలో ఉంటేనే తమ బతుకులు బాగుపడతాయని చెబుతున్నారని వాసుపల్లి తెలిపారు. నీకు 15 వేలు.. నీకు 15 వేలంటూ మభ్యపెట్టి ఇప్పుడు రూ. 13 వేలు ఇచ్చి, కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటిందని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు చేస్తున్నారంటూ పేద కుటుంబాలకు కుంటు సాకులతో తల్లికి వందనం రాకుండా చేస్తున్నారని వాసుపల్లి నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో ముజీబ్‌ఖాన్, సత్య వెంకటి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు రామచంద్రాపురం వాసి



భీమశంకర్ (పసుపు రంగు బనియన్ వేసుకున్న వ్యక్తి)ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధులు

అల్లిపురం: తాగుడు వ్యసనానికి అలవాటు పడిన తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రపురానికి చెందిన భీమశంకర్ అనే వ్యక్తి రెండేళ్ల క్రితం తల, కాలికి గాయాలై ఆస్పత్రి పాలయ్యాడు. అతనికి పెళ్లయి ఇద్దరు పిల్లలతో పాటు తల్లి, ఇద్దరు అన్నదమ్ములు, చెల్లి ఉన్నారు. ఎనిమిదేళ్ల నుండి మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. ఏడు నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయాడు. ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ చేసి, శ్రద్ధా ఫౌండేషన్ ద్వారాచి కిత్స అందించారు. కోలుకున్న భీమశంకర్‌ని విశాఖ నుంచి తీసుకెళ్లి తల్లి, తమ్ముడు మేడిశెట్టి ఆదినారాయణకు శుక్రవారం అప్పగించారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

గంజాయి కలిగిన వ్యక్తికి జైలు, జరిమానా

విశాఖ లీగల్: గంజాయి కలిగిన వ్యక్తికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ఎస్వీ ప్రసాద్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు తుమ్మల వెంకటేశ్వరరావు (45) వృత్తి రీత్యా వ్యాపారస్తుడు. నర్సీపట్నంలో నివాసం ఉంటున్నాడు. 2021 అక్టోబర్ 14న ఎక్సైజ్ పోలీసులు నర్సీపట్నం ప్రభుత్వ కళాశాల దగ్గర గంజాయి రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో నిఘా పెట్టారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో నిందితుడు 10 కేజీల గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో నర్సీపట్నం పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

‘అంబేడ్కర్ ఐడియాలజీ’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ తదితరులు

విశాఖ సిటీ: ‘మోడ్రనైజింగ్ డాక్టర్ అంబేడ్కర్ ఐడియాలజీ’ పుస్తకాన్ని డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మెంబర్ సెక్రటరీ ప్రభాత్ కుమార్ సింగ్ సమక్షంలో కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ ఆవిష్కరించారు. నేటితరం యువతను అంబేడ్కర్ ఆలోచనలతో అనుసంధానం చేసే విధానాన్ని పుస్తకంలో వివరించినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్‌ల ప్రగతిని సమీక్షించడానికి శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ 2024–25లో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధితో పాటు 2025– 26 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ సభ్యులకు వివరించారు. ఏయూలో ఏర్పాటైన అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైవిధ్యమైన కార్యక్రమాలు, ప్రజలకు, యువతకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైవిధ్యమైన పరిశోధనలతో పాటు విభిన్న వర్గాలకు చేరువయ్యేలా అంబేడ్కర్ చైర్ నిర్వహించిన కార్యక్రమాలను అమిత్ యాదవ్ ప్రశంసించారు. యువతలో అంబేడ్కర్ ఆలోచనలను తీసుకెళ్లి వారిని ప్రభావితం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏయూ అంబేడ్కర్ చైర్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్షకు ఏయూ తరపున ఆర్–డీ విభాగం డీన్ ఆచార్య వి.వల్లి కుమారి ప్రాతినిధ్యం వహించారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

వాటే.. గ్రేట్ ఐడియా!

ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు చల్లదనం కోసం వెంపర్లాడుతున్నారు. ఇంట్లో ఉంటే ఫ్యాన్ల కింద.. ఏసీ గదుల్లో గడుపుతున్నారు. బయటికి వెళ్తే ఏ చెట్టు నీడకో చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సూర్యాబాగ్‌లో ద్విచక్ర వాహనాల సీట్లు కుట్టే ఓ వ్యాపారి ఉక్కబోత నుంచి ఉపశమనం కోసం చెట్టు కింద వ్యాపారం నిర్వహించుకోవడమే కాకుండా ఆ చెట్టుకు ఫ్యాన్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అతనికి ఫ్యాన్ గాలితో పాటు చెట్టు గాలి తగులుతూ చక్కటి ఉపశమనం లభిస్తోంది.

– జగదాంబ



రహదారి విస్తరణ ఆలోచన విరమించుకోవాలి



వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘాల ప్రతినిధులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15, 16 వార్డుల పరిధిలోని కొత్త వెంకోజీపాలెం నుంచి సీతమ్మధార వరకు ఉన్న ప్రధాన రహదారిని వెడల్పు చేసే ఆలోచనను విరమించుకోవాలని పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం, శ్రీ రాధాకృష్ణ సేవా సంఘం సభ్యులు కోరారు. ఈ విషయమై సంఘాల సభ్యులతోపాటు రోడ్డు పక్కనున్న నివాసులు శుక్రవారం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో 40 అడుగుల రోడ్డును 60 అడుగులుగా విస్తరించారని, మళ్లీ ఇప్పుడు 80 అడుగులుగా విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దీని వల్ల అనేక మంది నివాసాలు కోల్పోతున్నారని చైర్మన్‌కు వారంతా వివరించారు. సొంతూరిలో గూడును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. రహదారి విస్తరణకు బదులు రోడ్డును ఆక్రమించి పెడుతున్న వాహనాలు, దుకాణాలను తొలగించే చర్యలు చేపడితే సరిపోతుందని, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలగదని సూచించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా సాధన

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ఈ నెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వాకర్స్ క్లబ్ సభ్యులు సాధన చేస్తున్నారు. దీనిలో భాగంగా యోగా మాస్టర్ సునీల్ పర్యవేక్షణలో వాకర్స్ పార్కు ప్రాంగణంలో శుక్రవారం యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ఎస్ఎస్వీ ప్రసాదరావు, సహ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, ఇతర సభ్యులు పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు సాధన చేశారు.

వాకర్స్ పార్కులో కూలిన ప్రహరీ



కూలిన ప్రహరీ గోడ

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ప్రహరీ గోడ కూలిపోయింది. పార్కు నిర్మాణంలో భాగంగా దీని స్థలం చుట్టూ 1989లో ఈ ప్రహరీ నిర్మించారు. ఇప్పటి వరకు ఇదే కొనసాగింది. కొత్తగా గోడ నిర్మించలేదు. ఇది శిథిలమవడంతో కూలిపోతుందని భయపడేవారు. దీన్ని పునర్నిర్మించాలని గతంలో వాకర్స్ క్లబ్ సభ్యులు జీవీఎంసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. పార్కు వెలుపలి వైపు ప్రహరీ, రహదారి మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలను పొక్లెయిన్‌తో తొలగిస్తుండగా.. కొమ్మ తగలగానే ప్రహరీ కూలిపోయింది. పార్కులో ప్రస్తుతం వాకింగ్ ట్రాక్ పనుల కారణంగా ట్రాక్ మూసివేయడం వల్ల ప్రమాదం తప్పింది. బేస్‌మెంట్‌పై ఉన్న సుమారు 200 మీటర్ల గోడ కూలిపోయింది. మిగతా ప్రాంతం కూడా కూలిపోయే పరిస్థితి ఉంది. అధికారులు తక్షణం స్పందించి శిథిలమైన ప్రాంతంలో గోడను పునర్నిర్మించాలని వాకర్స్ కోరుతున్నారు.

టెన్త్ టాపర్లకు సత్కారం



విద్యార్థులు, ఎన్‌సీసీ ఆఫీసర్ విశ్వనాథంను సత్కరిస్తున్న ఎంఈవో బాలామణి

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఇటీవల టెన్త్ పరీక్షల్లో 500 మార్కులు దాటిన విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ టాపర్లతోపాటు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను మండల విద్యా శాఖాధికారి బాలామణి చేతుల మీదుగా సత్కరించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం గ్రేడ్ 2 తెలుగు పండిట్ నుంచి తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా వారిని సన్మానించారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు రిజర్వేషన్ కారణంగా పలువురు విద్యార్థులు ఐఐటీ, పాలిటెక్నిక్‌లో సీట్లు లభించడంతో విశ్వనాథంను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, నిర్మల, టి.కిషోర్, వై.రామలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత

టీచ్‌రోడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి కె.నీలిమ సూచించారు. గర్భిణులు, బాలింతలు సమీప అంగన్‌వాడీ సెంటర్లలో తమ పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలన్నారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం సెక్టార్‌లోని 28వ వార్డు పందిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ముఖ్య అతిథి సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత చిన్నారులతో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. పళ్లెంలో బియ్యం వేసి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లలో చేర్పించి, అక్కడ అందిస్తున్న ఆటపాటలతో కూడిన విద్యను వినియోగించుకోవాలని కోరారు.

‘అంగన్‌వాడీ పిలుస్తోంది’ కరపత్రాల పంపిణీ



కరపత్రాలు అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మద్దిలపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కేంద్రం పరిధిలోని నివాసులకు అంగన్‌వాడీ కేంద్రం సేవలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను అందజేశారు. ‘మన ఊరు – మన అంగన్‌వాడీ’ గాంధీనగర్ కేంద్రంలో అడ్మిషన్లు జరుగుతున్నాయని స్థానికులకు వివరించారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు చక్కని ఆటపాటలతోపాటు కథలు, తెలుగు, ఇంగ్లిష్ బోధన, కిడ్స్ కేర్, ప్రతి రోజూ ఉచిత భోజనం, స్నాక్స్ అందిస్తామని, నర్సరీ నుంచి ఎల్‌కేజీ వరకు శిక్షణ ఉంటుందని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో టీచర్ మాలా బీబీ, ఎంఎస్‌కె వరలక్ష్మి, ఏఎన్‌ఎం స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com